# అందం

- ఎం. సోమశేఖరాచార్యులు



శివపురం జమిందార్ శేఖరునకు తను అందగాడినని మహాగర్వం.

ఒకసారి శేఖరుడు తన నౌకరు చంద్రంతో కలసి రాజధానికి బయలుదేరాడు. రాజధానికి చేరాలంటే మార్గమధ్యంలో వున్న అరణ్యాన్ని దాటుకుని వెళ్ళాలి. వారలా అరణ్య మార్గం గుండా నడుస్తుండగా శివపురం గ్రామస్థుడైన మరుగుజ్జు శ్రీపతి వారిని కలిసాడు. ముగ్గురూ కలసి ప్రయాణించసాగారు.

శ్రీపతికి మరుగుజ్జుతనమే కాక అవిటితనం కూడా వుంది. అతనికి కుడికాలు కొద్దిగా పొట్టి కుంటుతూ నడుస్తాడు.

శేఖరుడు చంద్రంతో "ఒరే, మరుగుజ్జు శ్రీపతిని చూసావుకదా, ఎంత అనాకారిగా వున్నాడో, అందంలేని ఆ జీవితం బ్రతికే కంటే చావడం మేలు" అన్నాడు.

శేఖరుని మాటలు శ్రీపతిని బాధించాయి. ఐనా సరే ఏమీ అనలేకపోయాడు. కారణం అతను జమిందార్ కావటమే!

ఇంతలో హఠాత్తుగా వర్షం మొదలైంది. ఓ ముదుసలి వర్షానికి తడుస్తూ కదలలేని స్థితిలో మర్రిచెట్టుక్రింద కూర్చుని వున్నాడు!

ఆ ముదుసలిని చూసి శ్రీపతి పరుగు పరుగున వెళ్ళి ఆ ముదుసలిని చేతుల్లోకి తీసుకుని అక్కడ సమీపంలో వున్న దేవాలయంలో కూర్చుండబెట్టి తన భుజాన వున్న దుప్పటి తీసి అతనికి కప్పి బయటికి వచ్చాడు.

చంద్రం శేఖరునితో "అయ్యా, తమరింతకు మునుపు శ్రీపతి గురించి చాలా హీనంగా మాట్లాడారు. కానీ శ్రీపతే ఆపదలో వున్న ముదుసలిని ఆదుకున్నాడు. ఆపని మనిద్దరం చేయలేకపోయాము" అన్నాడు.

శేఖరుడు "చంద్రం, నువ్వు చెప్పింది అక్షరాల నిజం. కనిపించే బాహ్యసౌందర్యం కన్నా అంతః సౌందర్యం ముఖ్యమని గ్రహించాను. అసలైన అందగాడు శ్రీపతే!" అన్నాడు.

అది మొదలు శేఖరుని ప్రవర్తనలో మార్పు వచ్చింది. ★